నమస్తే తెలంగాణ



# ఏజెన్సీలో టీచర్ నియామకాలు చేపట్టాలి

- జీవో 3కు చట్టబద్ధత కల్పించాలి
- ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ డిమాండ్
- సంక్షేమభవన్ ఎదుట భారీ ధర్నా

హైదరాబాద్, మార్చి 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని 5వ షెడ్యూల్డ్‌లో ఉన్న ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధ్యాయ నియామకాలను గిరిజన నిరుద్యోగులతోనే చేపట్టాలని, ఇప్పటికే పనిచేస్తున్న టీచర్లకు పదోన్నతులు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు వందలాది మంది టీచర్లు, ఆదివాసీ యువకులతో హైదరాబాద్‌లోని మాసబ్ ట్యాంక్‌లో గల సంక్షేమ భవన్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్ ఏటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బాకుల రవి మాట్లాడుతూ.. ఏజన్సీ ప్రాంతాల్లోని అన్ని యాజమాన్య పాఠశాలల్లోని ఉపాధ్యాయ ఖాళీలను ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీ 2024 నిర్వహించి ఆదివాసీ గిరిజన నిరుద్యోగులతో మాత్రమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మన్ననూర్ ఐటీడీఏ పరిధిలో పీటీజీ చెంచు తెగలకు కేటాయించిన 56 ఎస్‌జీటీ ఉపాధ్యాయ పోస్టుల్లో ప్రస్తుతం పనిచేస్తున్న సీఆర్టీలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

### ఏటూరునాగారంలో ధర్నా

ఏటూరునాగారం, మార్చి 11: ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట తుడుం దెబ్బ, ఏటీఎఫ్, ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు.




మాసబ్ ట్యాంక్‌లోని సంక్షేమ భవన్ వద్ద ధర్నా చేస్తున్న ఆదివాసీ టీచర్లు, యువకులు



సోమవారం నిర్మల్‌లోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కౌంటర్ వద్ద క్యూలైన్‌లో నిలబడ్డ అర్జీదారులు

# 'గృహజ్యోతి'కి తప్పని తిప్పలు

- ప్రజా పాలనలో దరఖాస్తు ఇచ్చినా దక్కని అర్హత
- ఆన్‌లైన్ కోసం మళ్లీ ఎంపీడీవో ఆఫీసు వద్ద పడిగాపులు

బయ్యారం/నిర్మల్ అర్బన్, మార్చి 11: 'గృహజ్యోతి' లబ్ధి కోసం వివరాలను ఆన్‌లైన్ చేసుకునేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీసులో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ వద్ద భారీగా క్యూలో నిల్చున్నారు. గత నెల 27 నుంచి గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, రూ.500కు గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించగా.. మండలంలోని చాలా మంది పేద కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. అందులో చాలా మందికి అర్హత లభించక గందరగోళం నెలకొంది. ప్రజాపాలనలో 29 జీపీలకు 15,776 మంది దరఖాస్తు చేసుకుంటే, కేవలం 5,954 మంది మాత్రమే 200 యూనిట్ల ఉచిత కరంట్ (జీరో బిల్)కు అర్హులుగా విద్యుత్తు శాఖకు జాబితా అందింది. విద్యుత్తు సిబ్బంది కరెంట్ బిల్లులు ఇస్తున్న క్రమంలో తమకు గృహజ్యోతి పథకం వర్తించలేదని ప్రజలు ఆందోళన చెందారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం తెల్లరేషన్ కార్డు ఉండి గృహజ్యోతి పథకంలో అర్హత పొందని వారు ఆధార్‌కార్డు, విద్యుత్తు బిల్లు వివరాలను మళ్లీ ఆన్‌లైన్ చేసుకోవాలని సూచించింది. దీంతో ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల వద్ద బారులు తీరారు.

### మళ్లీ దరఖాస్తు

'గృహజ్యోతి' కింద 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్తు ఇస్తామని చెప్పడంతో అందరూ దరఖాస్తు చేసుకున్నప్పటికీ.. కొందరికే జీరో బిల్లులు వచ్చాయి. చాలా మంది జీరో బిల్లుకు అనర్హులయ్యారు. కాంగ్రెస్ సర్కారు మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని సూచించడంతో.. నాలుగు రోజులుగా మున్సిపాలిటీల్లో జీరో బిల్లు రానివారు దరఖాస్తు చేసుకుంటున్నారు.

# మా ఇండ్లు మాకే ఇవ్వాలి

**'డబుల్ ఇండ్ల' లబ్ధిదారుల డిమాండ్**

- పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట ఆందోళన
- కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్‌కు వినతి

పెద్దపల్లి, మార్చి 11(నమస్తే తెలంగాణ): తమ ఇండ్లు తమకే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. 'ప్రభుత్వానికి మా మీద చిన్నచూపెందుకు'? అనే ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ సర్కారు పెద్దపల్లి మున్సిపాల్టీ పరిధిలోని చందపల్లి, కూనారం రోడ్లల్లో 484 ఇండ్లను నిర్మించి, డ్రా తీసి లబ్ధిదారులను ఎంపిక చేసిందని చెప్పారు. కొన్ని మరమ్మతుల కారణంగా ఇప్పటివరకు ఇండ్లను అప్పగించలేదని, కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో తమను కాదని కొత్తవారిని ఎంపిక చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని వాపోయారు. అదే జరిగితే తాము ఊరుకోబోమని హెచ్చరించారు. అనంతరం తమ ఇండ్లు తమకే ఇవ్వాలని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్‌కు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వేళ గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్రూం ఇండ్లకు ఎంపికైన లబ్ధిదారులు ఆందోళనకు దిగడం చర్చనీయాంశంగా మారింది.




పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు

# ప్రమోషన్లు ఇచ్చి న్యాయం చేయండి

- గురుకుల జేఏసీ వినతి

హైదరాబాద్, మార్చి11 (నమస్తే తెలంగాణ): ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లోని ఉపాధ్యాయ, ఉద్యోగులకు ప్రమోషన్లను కల్పించి న్యాయం చేయాలని గురుకుల ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ తరపున మామిడి నారాయణ, డాక్టర్ మధుసూదన్ కోరారు. దాదాపు 150 మంది ఉపాధ్యాయులు సోమవారం ఎస్సీ ఎస్టీ గురుకుల సొసైటీకి తరలివచ్చి ఉన్నతాధికారులను కలిసి విన్నవించారు. సమస్యలపై వినతిపత్రం అందజేశారు. త్రీ వన్ సెవెన్, ప్రమోషన్స్ కోసం ఒక షెడ్యూల్ అనౌన్స్ చేయాలని అధికారులకు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్ల ఉత్తర్వులు ఇవ్వలేకపోతున్నామని, ముగిశాక ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారని జేఏసీ నేతలు తెలిపారు.



సోమవారం సిరిసిల్లలోని అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహిస్తున్న నేత కార్మికులు

# ఎమ్మెల్యేల ఇండ్ల ముందు నిరసన

మంచిర్యాల అర్బన్, మార్చి 11 : పారిశుధ్య కార్మికుల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం మంచిర్యాల పట్టణంలోని మంచిర్యాల, చెన్నూర్ నియోజకవర్గాల ఎమ్మెల్యేల ఇండ్ల ముందు ఆందోళన నిర్వహించారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్‌కుమార్ మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఆ కుటుంబాలు నానా అవస్థలు పడుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నెలనెలా వేతనాలు చెల్లించాలని కోరారు.

### పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట ఆందోళన

పెద్దపల్లి, మార్చి 11 (నమస్తే తెలంగాణ): మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో పంచాయతీ కార్మికులు సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. సీఐటీయూ అనుబంధ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అధికారంలోకి వస్తే నెల నెలా జీతాలు చెల్లిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే మెరుపు సమ్మె చేపడతామని హెచ్చరించారు.




చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

# డీఎస్సీతోపాటే టెట్ నిర్వహించాలి

**విద్యాశాఖ కమిషనరేట్ ముట్టడిలో ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్**

ఖైరతాబాద్, మార్చి 11 : డీఎస్సీతో పాటు టెట్ నిర్వహించాలని నిరుద్యోగ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు హైదరాబాద్ సైఫాబాద్‌లోని విద్యాశాఖ కమిషనరేట్‌ను ముట్టడించింది. అనంతరం జేఏసీ నేతలు ధర్నా నిర్వహించగా, ఎంపీ ఆర్ కృష్ణయ్య పాల్గొని వారికి సంఘీభావం తెలిపారు. గతంలో ప్రతిసారి డీఎస్సీతో పాటు టెట్ కూడా నిర్వహించేవారని కృష్ణయ్య గుర్తుచేశారు. కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో టెట్ నిర్వహించిన తర్వాత ఆయా పోస్టులను భర్తీ చేశారని తెలిపారు. పీఆర్‌సీ కమిటీ రిపోర్టు ప్రకారం.. ప్రభుత్వ బడుల్లో ఖాళీగా ఉన్న 24వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని కృష్ణయ్య కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ ఐక్య వేదిక జాతీయ అధ్యక్షుడు జీ అనంతయ్య, బీసీ విద్యార్థి సేన అధ్యక్షుడు వేముల రామకృష్ణ, నేతలు ఉదయ్, జయంతి, కృష్ణ, చందు తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో రోడ్డెక్కిన నేతన్నలు

- ఉపాధి కల్పించాలని రాస్తారోకో

రాజన్న సిరిసిల్ల, మార్చి 11 (నమస్తే తెలంగాణ): వస్త్ర పరిశ్రమకు ఆర్డర్లు ఇచ్చి తమకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ నేతన్నలు రోడ్డెక్కారు. బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వకుండా, పెండింగ్ బకాయిలు రూ.200 కోట్లు విడుదల చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మరమగ్గాల కార్మికులు పెద్ద సంఖ్యలో సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిరసనకు దిగారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి ర్యాలీగా వచ్చి అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేశారు. కలెక్టర్ రావాలంటూ నినదించారు. రాస్తారోకోతో ట్రాఫిక్ స్తంభించి పోయింది. వాహనాలు నిలిచి పోవడంతో పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. తమ నాయకులను విడుదల చేయాలంటూ నేతన్నలు పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు కొద్దిసేపటి తర్వాత స్టేషన్ బెయిల్‌పై విడిచి పెట్టారు.

## ప్రొఫెసర్ సాయిబాబా విడుదలపై స్టేకు సుప్రీం నిరాకరణ

న్యూఢిల్లీ: మావోయిస్టులతో సంబంధాల కేసులో మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాను ఇటీవల నిర్దోషిగా ప్రకటిస్తూ విడుదల చేయటంపై స్టే ఇవ్వాలని మహారాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు సోమవారం తోసిపుచ్చింది. దీంతో ప్రొఫెసర్ సాయిబాబాతో పాటు విడుదలైన మరో ఐదుగురికి భారీ ఊరట లభించినట్టయ్యింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను పరిశీలించిన జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం బాంబే హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు సహేతుకమైనవని తేల్చి చెప్పింది. అయినా ప్రభుత్వ అప్పీలును విచారణకు స్వీకరిస్తున్నామని పేర్కొన్నది. స్టే విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై వీలైనంత త్వరగా విచారణ చేపట్టాలని మహారాష్ట్ర ప్రభుత్వం తరపున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు విజ్ఞప్తి చేశారు. ఆయన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. తీర్పును వెనక్కి తీసుకోవటంలో తొందరపాటు కూడదని హితవు పలికింది. తీర్పు హేతుబద్ధంగా లేనిపక్షంలో పరిగణనలోకి తీసుకునే వారమని వెల్లడించింది. నిర్ణీత సమయంలోనే ఈ పిటిషన్ విచారణకు వస్తుందని స్పష్టం చేసింది. మావోయిస్టులతో సంబంధాలున్నాయనే నెపంతో 2014లో ప్రొఫెసర్ సాయిబాబాతో పాటు మరో ఐదుగురిని మహారాష్ట్ర పోలీసులు అరెస్ట్ చేశారు.

## పాక్ ప్రథమ మహిళగా అసీఫా భుట్టో!

ఇస్లామాబాద్: పాకిస్థాన్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ కీలక నిర్ణయం తీసుకున్నారు. పాక్ మీడియా కథనాల ప్రకారం, ఆ దేశ ప్రథమ మహిళగా జర్దారీ తన కుమార్తె అసీఫా భుట్టో (31)ని అధికారికంగా ప్రకటించాలని నిర్ణయించుకున్నారు. సాధారణంగా దేశాధ్యక్షుని సతీమణి ఆ దేశ ప్రథమ మహిళ అవుతారు. అయితే ఆయన సతీమణి బెనజీర్ భుట్టో 2007లో హత్యకు గురైన తర్వాత ఆయన పునర్వివాహం చేసుకోలేదు. 2008–2013 మధ్య కాలంలో కూడా జర్దారీ దేశాధ్యక్ష పదవిని నిర్వహించారు. అప్పుడు దేశ ప్రథమ మహిళ హోదాను ఎవరికీ ఇవ్వలేదు. ఈసారి మాత్రం తన కుమార్తె అసీఫాను దేశ ప్రథమ మహిళగా గుర్తించాలని ఆయన నిర్ణయించుకున్నారు.

# మిషన్ 'దివ్యాస్త్ర' సక్సెస్

- ఎంఐఆర్‌వీ ఆధారిత అగ్ని-5 తొలి టెస్ట్ ఫ్లైట్ విజయవంతం
- ఒకేసారి బహుళ లక్ష్యాల ఛేదన
- దేశీయంగా ఎంఐఆర్‌వీ సాంకేతికత అభివృద్ధి
- అగ్రదేశాల సరసన భారత్



న్యూఢిల్లీ, మార్చి 11: భారత అమ్ములపొదిలో మరో దివ్యాస్త్రం చేరింది. 'మిషన్ దివ్యాస్త్ర' పేరుతో ఒకేసారి బహుళ లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యంతో రూపొందించిన అగ్ని 5 క్షిపణిని భారత రక్షణ పరిశోధన సంస్థ (డీఆర్‌డీవో) సోమవారం విజయవంతంగా పరీక్షించింది. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ క్షిపణిని మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటబుల్ రీ ఎంట్రీ వెహికిల్ (ఎంఐఆర్‌వీ) టెక్నాలజీతో డీఆర్‌డీవో అభివృద్ధి చేసింది. అగ్ని 5 క్షిపణి తొలి ప్రయోగం విజయవంతం కావడంపై ప్రధాని నరేంద్రమోదీ హర్షం వ్యక్తం చేశారు. డీఆర్‌డీవో శాస్త్రవేత్తలను అభినందించారు. తాజా ప్రయోగంతో ఎంఐఆర్‌వీ సాంకేతికత కలిగిన అగ్రదేశాల సరసన భారత్ చేరింది. ఈ ప్రాజెక్టు హెడ్ ఒక మహిళ అని, ఇందులో అనేక మంది మహిళలు కీలకపాత్ర పోషించారని రక్షణ వర్గాలు వెల్లడించాయి.

అణ్వస్త్ర సామర్థ్యమున్న అగ్ని 5 క్షిపణి 5,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. చైనాలోని ఉత్తరప్రాంతాలు సహా ఆసియా మొత్తం ఈ క్షిపణి పరిధిలోకి వస్తుంది. యూరప్‌లోని పలు ప్రాంతాలు కూడా దీని పరిధిలోకి వస్తాయి. అగ్ని 5 క్షిపణిని డీఆర్‌డీవో ఇదివరకే అనేకసార్లు పరీక్షించింది. అయితే ఎంఐఆర్‌వీ సాంకేతికతో పరీక్షించడం ఇదే తొలిసారి. అగ్ని 1 నుంచి అగ్ని–4 క్షిపణులు 700 కిలోమీటర్ల నుంచి 3500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలవు. వీటిని ఇప్పటికే సైన్యంలో మోహరించారు.

### ఏమిటీ ఎంఐఆర్‌వీ?

ఎంఐఆర్‌వీ టెక్నాలజీతో ఒకే క్షిపణితో బహుళ వార్‌హెడ్‌లను వేర్వేరు లక్ష్యాలపై ప్రయోగించవచ్చు. ఒక క్షిపణి 10 వరకు వార్‌హెడ్‌లను మోసుకుపోగలదు. ఈ క్షిపణిలోని వార్‌హెడ్‌లను వేర్వేరు దిశల్లో వేర్వేరు వేగాలతో ప్రయోగించవచ్చు. ప్రస్తుతం అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా, చైనా వద్ద మాత్రమే ఈ టెక్నాలజీ ఉంది. పాకిస్థాన్ కూడా ఈ టెక్నాలజీపై ప్రయోగాలు చేస్తున్నది.

## మాల్దీవులను వీడిన భారత సైనికులు

మాలే: మాల్దీవులలోని భారత సైన్యంలో దాదాపు 25 మంది సోమవారం స్వదేశానికి బయల్దేరారు. మాల్దీవులకు భారత్ బహుమతిగా ఇచ్చిన హెలికాప్టర్ కార్యకలాపాలను వీరు నిర్వహించేవారు. వీరు ఆ బాధ్యతలను ఇండియన్ పౌర సిబ్బందికి అప్పగించారు. ఈ వివరాలను మాల్దీవ్స్ నేషనల్ డిఫెన్స్ ఫోర్స్(ఎంఎన్‌డీఎఫ్) ప్రతినిధి చెప్పినట్లు ఆ దేశ మీడియా సోమవారం వెల్లడించింది. అయితే భారత రక్షణ శాఖ దీనిని ధ్రువీకరించలేదు. మాల్దీవుల్లో మిగిలిన భారతీయ సైనికులు మే 10 నాటికి తిరిగి భారత్‌కు వెళ్లిపోతారని ఎంఎన్‌డీఎఫ్ ప్రతినిధి చెప్పినట్లు మాల్దీవుల మీడియా తెలిపింది. మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు కూడా ఇదే విషయాన్ని గతంలో చెప్పారు. భారత దేశానికి చెందిన సైనికులు కానీ, సాధారణ అధికారులు కానీ మే 10 తర్వాత మాల్దీవుల్లో ఉండరన్నారు.




## ద్వారక ఎక్స్‌ప్రెస్‌వే హర్యానా సెక్షన్ ప్రారంభం

గురుగ్రామ్: ద్వారక ఎక్స్‌ప్రెస్‌వేలోని హర్యానా సెక్షన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ప్రారంభించారు. 19 కిలోమీటర్ల పొడవైన ఈ మార్గం అందుబాటులోకి రావడం వల్ల ఢిల్లీ–గురుగ్రామ్ మధ్య ఎన్‌హెచ్–48పై ట్రాఫిక్ రాకపోకలు సులువవుతాయి. అదే సమయంలో దేశ రాజధాని ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలు మరింత అభివృద్ధి చెందుతాయని మోదీ చెప్పారు. దీనితోపాటు 112 జాతీయ హైవే ప్రాజెక్టులను ప్రారంభించడం దేశ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఓ మైలురాయి అని తెలిపారు. ఎక్స్‌ప్రెస్‌వేల వల్ల గ్రామీణ భారతానికి సరికొత్త అవకాశాలు వస్తాయని చెప్పారు. ద్వారక ఎక్స్‌ప్రెస్‌వే మొత్తం పొడవు 29 కిలోమీటర్లు, దీనిలో 18.9 కిలోమీటర్లు హర్యానా సెక్షన్‌లోనూ, మిగిలిన 10.1 కిలోమీటర్లు ఢిల్లీలోనూ ఉంది. ఈ ఎక్స్‌ప్రెస్‌వేకి 2019 మార్చి 9న అప్పటి కేంద్ర మంత్రులు సుష్మా స్వరాజ్, అరుణ్ జైట్లీ, నితిన్ గడ్కరీ శంకుస్థాపన చేశారు.

# ఆయుధ దిగుమతుల్లో భారత్ టాప్

లండన్, మార్చి 11: ప్రపంచంలో అత్యధికంగా ఆయుధాల్ని దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో భారత్ మొదటిస్థానంలో నిలిచింది. స్టాక్‌హోం ఇంటర్నేషనల్ పీస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిప్రి) తాజా నివేదికలో ఈ విషయం వెల్లడైంది. 2014–18తో పోల్చితే 2019–23 మధ్య కాలంలో భారత ఆయుధ దిగుమతులు 4.7 శాతం పెరిగాయని, మొత్తం ఆయుధ దిగుమతుల్లో 36 శాతం రష్యా నుంచి ఉన్నాయని నివేదిక తెలిపింది.






**ఆయుధ ఎగుమతుల్లో టాప్ దేశాలు**

| దేశం | (వాటా- శాతాల్లో) |
|---|---|
| అమెరికా | 42 |
| ఫ్రాన్స్ | 11 |
| రష్యా | 11 |
| చైనా | 5.8 |
| జర్మనీ | 5.6 |

## మరో ఉద్యమానికి కైలాస్ సత్యార్థి శ్రీకారం

- కరుణను ప్రపంచీకరించాలని పిలుపు

న్యూఢిల్లీ, మార్చి 11: బాలల హక్కుల కార్యకర్త, నోబెల్ అవార్డు గ్రహీత కైలాస్ సత్యార్థి సోమవారం మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో 'సత్యార్థి మూవ్‌మెంట్ ఫర్ గ్లోబల్ కంపాషన్' (ఎస్‌ఎంజీసీ)ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యార్థి మాట్లాడుతూ దయార్ద్ర చర్చలు, చర్యలతో ప్రపంచాన్ని సంస్కరించవచ్చని పిలుపునిచ్చారు. నోబెల్ గ్రహీతలు, గ్లోబల్ లీడర్లు, వ్యాపారులు, విద్యా సంస్థలు, యువత అంతా కలిసి పౌరసమాజాన్ని న్యాయమైన సమాజంగా నిర్మించటానికి చొరవ చూపాలన్నారు. దీని వల్ల ప్రపంచంలోని అంతరాలన్నీ తొలగిపోతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రపంచ వ్యాప్తంగా కరుణ భూమిక కావాలని తాను దశాబ్దాలుగా వాదిస్తున్నానని, అందులో భాగంగా ఈ రోజు మరో అడుగు ముందుకు పడిందని సత్యార్థి చెప్పారు. ప్రతి ఒక్కరూ తమలోని కారుణ్యాన్ని గుర్తించి ఈ ఉద్యమంలో భాగస్తులు కావాలని కోరారు.

## అమెరికాకే భారత విద్యార్థుల మొగ్గు

- 2022-23లో 35% పెరిగిన విద్యార్థుల సంఖ్య
- భారత్‌ను కొత్త ఆదాయ వనరుగా చూస్తున్న అక్కడి యూనివర్సిటీలు
- టైర్ 2, టైర్ 3 నగరాలపై ప్రత్యేక దృష్టి



న్యూఢిల్లీ: అమెరికాలో ఉన్నత చదువులు చదువుతున్న భారతీయ విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతున్నది. నాణ్యమైన విద్య, ఎక్కువ జీతం కోసం భారతీయ విద్యార్థులు చలో అమెరికా అంటున్నారు. 2022–23 విద్యా సంవత్సరంలో అమెరికాలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న భారత విద్యార్థుల సంఖ్యలో 35 శాతం పెరుగుదల నమోదైంది. భారత్‌తో పోలిస్తే చదువులకు అయ్యే ఖర్చు కాస్త ఎక్కువైనా.. అమెరికాలో మంచి ఉద్యోగం దొరికితే జీవితంలో చక్కగా స్థిరపడొచ్చని ఇండియన్ యూత్ భావిస్తున్నది. మరో ఆసక్తికర పరిణామం ఏమంటే.. అమెరికాలో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు చదివే భారత మధ్య తరగతి విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతున్నది. అసోసియేటెడ్ ప్రెస్ అంచనాల ప్రకారం ప్రస్తుతం అమెరికాలో 2.69 లక్షల మంది భారతీయులు ఉన్నత విద్య అభ్యసిస్తున్నారు. భారత్‌లోని టైర్ 2, 3 నగరాల విద్యార్థులు కూడా అమెరికా చదువులపై ఆసక్తి చూపిస్తున్నారు. భారత విద్యార్థులు ట్యూషన్ ఫీజులు పూర్తిగా చెల్లిస్తుండటం వల్ల అమెరికా యూనివర్సిటీల ఆదాయం బాగానే పెరుగుతున్నది.

### అడ్మిషన్ అక్కడే సులువు!

భారత్‌లోని ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల కన్నా అమెరికాలోని ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో సీటు సంపాదించడం భారతీయ విద్యార్థులకు కొంత సులువుగా మారింది. దరఖాస్తు చేసినవారిలో కేవలం 0.2 శాతం మందికి మాత్రమే భారత్‌లోని ప్రతిష్ఠాత్మక సంస్థలు ప్రవేశాలు కల్పిస్తుండగా అగ్రరాజ్యంలోని హార్వర్డ్ యూనివర్సిటీలో అది 3 శాతంగా, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో 4 శాతంగా ఉంది. చాలా మంది భారత విద్యార్థులు అమెరికాలో సైన్స్, గణితం, ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరుతున్నారు. ఈ రంగాల్లో నిపుణుల కొరత ఉండటంతో అక్కడే తమకు ఉద్యోగం లభిస్తుందని వారు భావిస్తున్నారు. చదువు పూర్తయ్యాక మూడేండ్ల పాటు అమెరికాలో పనిచేసే అవకాశాన్ని అక్కడి ప్రభుత్వం కల్పిస్తుండటం విదేశీ విద్యార్థులకు వరంగా మారింది. వీసా ప్రక్రియను కూడా బైడెన్ సర్కారు సులభతరం చేసింది.

# తండ్రికి తగ్గ తనయ

- ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌లో తండ్రి వీర మరణం
- 20 ఏండ్ల తర్వాత తండ్రి యూనిఫాం ధరించి ఆర్మీలో చేరిన కుమార్తె



న్యూఢిల్లీ, మార్చి 11: ఉగ్రవాదులతో పోరాడుతూ తండ్రి వీరమరణం పొందినప్పుడు ఆమె మూడేండ్ల చిన్నారి. 20 ఏండ్ల తర్వాత.. తండ్రి యూనిఫాం ధరించి, సైన్యంలోకి సగర్వంగా అడుగుపెట్టారు లెఫ్టినెంట్ ఇనాయత్ వత్స్. చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో శిక్షణ పొందిన ఆమె ఈ నెల 9న భారత సైన్యంలో విధుల్లో చేరారు. పాసింగ్ అవుట్ పరేడ్‌లో తన తండ్రి చివరిసారిగా ధరించిన ఆలివ్ గ్రీన్ యూనిఫామ్‌నే ఆమె ధరించారు. ఈ సందర్భంగా 'ఆర్మీ కూతురు లెఫ్టినెంట్ ఇనాయత్ వత్స్‌కు స్వాగతం' అంటూ భారత సైన్యం ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ఇనాయత్ వత్స్ ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని లేడీ శ్రీరామ్ కాలేజీలో డిగ్రీ చదివారు. ఆమె తండ్రి మేజర్ నవనీత్ వత్స్ నవంబర్ 2003లో శ్రీనగర్‌లో జరిగిన ఒక ఎన్ కౌంటర్‌లో చనిపోయారు. ఆయన ధైర్యసాహసాలకు మెచ్చిన కేంద్రం సేనా మెడల్ ప్రకటించి గౌరవించింది.

## మైసూరు రాజ వంశీకునికి బీజేపీ టికెట్?

బెంగళూరు: కర్ణాటకలోని కొడగు–మైసూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి మైసూరు రాజ వంశీకుడిని పోటీ చేయించాలని బీజేపీ ప్రయత్నిస్తున్నది. ఇప్పటికే ఈ వంశానికి చెందిన యదువీర్ కృష్ణదత్త చామరాజ వడియార్‌తో బీజేపీ నేతలు చర్చలు జరిపినట్లు సమాచారం. అయితే ఆయన పోటీ చేయడంపై రాజమాత ప్రమోద దేవి వడియార్ తుది నిర్ణయం తీసుకుంటారని తెలుస్తున్నది. ఈ నియోజకవర్గం సీఎం సిద్దరామయ్య ఇలాకా కావడంతో, ఎవరినీ శత్రువులుగా మార్చుకోకుండా జాగ్రత్త వహించాలని ఈ రాజ కుటుంబం కోరుకుంటున్నట్లు కొందరు బీజేపీ నేతలు చెప్తున్నారు. ఈ నియోజకవర్గ ప్రస్తుత ఎంపీ, బీజేపీ నేత ప్రతాప్ సింహను ఆ పార్టీ పెద్దలు పక్కనపెట్టినట్లు వార్తలు వస్తున్నాయి. పార్లమెంటు భద్రత ఉల్లంఘన కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ వ్యక్తికి విజిటర్స్ పాస్‌ను ప్రతాప్ ఇచ్చిన విషయం బయటపడటమే దీనికి కారణమని చెప్తున్నారు.